మేల్కొనకపోతే ముప్పే..!

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- డెంగ్యూ, మలేరియాలపై అప్రమత్తం
- జోన్-5లో హై రిస్క్ ఏరియాలుగా నాలుగు వార్డులు
- అదనపు సిబ్బంది నియామకంపై అధికారుల దృష్టి


మురుగు గుంతలో స్ప్రే చేస్తున్న సిబ్బంది


ఎన్ఏడీలోని మలేరియా విభాగం భవనం


ఫేషియల్ హాజరు నమోదు చేస్తున్న సిబ్బంది


52వ వార్డులో మురుగు నీటిని శుభ్రం చేస్తున్న సిబ్బంది

విశాఖ విద్య: జీవీఎంసీ జోన్-5 పరిధిలోని వార్డుల్లో సీజనల్ వ్యాధులు పొంచి ఉన్నాయి. పారిశ్రామిక ప్రాంత శివారు కాలనీల ప్రజలు ఎక్కువగా మలేరియా, డెంగ్యూ వాధుల బారిన పడుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి మే నెలఖారు వరకు జోన్ పరిధిలో 40 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఇప్పుడే ఇలా ఉంటే.. వర్షా కాలం మొదలైతే పరిస్థితి ఎలా ఉంటుందోనని ఈ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ కూలీ పనులు చేసుకునే వారు వైద్యం కోసమని పెద్దాస్పత్రులకు వెళ్లలేని పరిస్థితుల్లో స్థానిక వైద్య ఆరోగ్య సిబ్బంది, జీవీఎంసీ మలేరియా విభాగాన్ని అప్రమత్తం చేస్తేనే సీజనల్ వ్యాధుల బారి నుంచి బయటపడతామని స్థానికులు అంటున్నారు.

కోరలు చాస్తున్న డెంగ్యూ

పారిశ్రామ ప్రాంతంలోని శివారు కాలనీల్లో ఎక్కువగా డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయి. డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోవడం, మురుగు నిల్వ ఉండటం వల్ల దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ కారణంగానే డెంగ్యూ వ్యాధి పీడితులు పెరుగుతున్నారు. ఇళ్ల ముందు నీటి గుంతలను ముందుగానే గుర్తించి, అలాంటి వాటిలో దోమల నివారణ చర్యలు చేపట్టాలి. సీజనల్ వ్యాధులకు అడ్డకట్ట వేసేలా జీవీఎంసీ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

హై రిస్క్ ఏరియాలో అప్రమత్తం

జ్ఞానాపురం కేంద్రంగా ఉన్న జోన్-5 కార్యాలయ పరిధిలో 24 వార్డులు ఉన్నాయి. కార్యక్రమాల పర్యవేక్షణలో భాగంగా రెండు విభాగాలుగా చేశారు. ఎన్ఏడీ కేంద్రంగా 17 వార్డులు, మల్కాపురం కేంద్రంగా 7 వార్డులపై పర్యవేక్షణ చేస్తూ, వ్యాధులకు అడ్డుకట్ట వేసేలా మలేరియా విభాగంలో సిబ్బందిని ఏర్పాటు చేశారు. జోనల్ కార్యాలయ వైద్యాధికారి ఆధ్వర్యంలో ఆయా విభాగాలకు మలేరియా ఇన్‌స్పెక్టర్లు సీజనల్ వ్యాధుల నివారణ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. వీరితో పాటు, ప్రతి వార్డులో ఒక హెల్త్ సూపర్‌వైజర్, మరో నలుగురు పీడీపీ సిబ్బంది పనిచేస్తున్నారు. 47, 48, 59, 60 వార్డుల పరిధిలో ఎక్కువగా డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ వర్షా కాలంలో పనిచేసేలా 63 మంది సీజనల్ వర్కర్లను విధుల్లోకి తీసుకున్నారు. వీరిలో ఎన్ఏడీ కేంద్రంగా 40 మంది, మల్కాపురం కేంద్రంగా 20 మంది పని చేయనున్నారు. హై రిస్క్ ఏరియా అయినందున మరో 30 మందిని నియమించాల్సిన అవసరాన్ని ఇక్కడి అధికారులు జీవీఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ఫేషియల్ హాజరుతో ఇక్కట్లు

వార్డుల్లో పనిచేసే సిబ్బంది ప్రతి రోజూ తప్పనిసరిగా రెండు సార్లు ఫేషియల్ హాజరు నమోదు చేయాలని జోనల్ కార్యాలయ అధికారులు నిర్దేశించారు. ఇదికాస్తా రోజువారీ విధులకు అంతరాయం కలిగిస్తోందని సిబ్బంది అంటున్నారు. క్షేత్రస్థాయి పనితీరులో పారదర్శకత కోసమని ఇలాంటి చర్యలు చేపట్టాల్సిందే. వార్డుల్లో పనిచేసే సిబ్బంది అంతా ఎన్ఏడీ, లేదంటే అటు మల్కాపురం పాయింట్లకు వెళ్లి, ఉదయం, మధ్యాహ్నం వేళల్లో ఫేషియల్ హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. తాటిచెట్లపాలెం నుంచి ఎన్ఏడీ వరకు రోజుకు రెండు సార్లు వెళ్లి రావడంతోనే సగం సమయం అయిపోతుంది. వార్డుల పరిధిలోనే హెల్త్ సూపర్‌వైజర్లు సిబ్బంది పనిచేసే చోటకే వెళ్లి ఫేషియల్ హాజరు నమోదు చేసినట్లయితే కొంత మేర రోజు వారీ పనితీరులో పురోగతి కనిపిస్తోంది. ఆ దిశగా జీవీఎంసీ అధికారులు ఆలోచించాల్సిన అవసరం ఉంది.

క్లుప్తంగా

ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి గుణిశెట్టి రాజీనామా


శ్రీనివాసరావు

గోపాలపట్నం: ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా, జీవీఎంసీ 91వ వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు తన పదవికి రాజీనామా చేశారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ఓటమితో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ పరంగా తన పోరాటం సాగుతుందని అందుకు పదవులతో పని లేదన్నారు. పార్టీ ఆదేశాల మేరకు పని చేస్తామని తెలిపారు.

గరిడీతో అప్పన్న క్షేత్రానికి ఎమ్మెల్యే గణబాబు


గోపాలపట్నం నుంచి గరిడీతో కాలినడకన బయలుదేరిన ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు శనివారం గోపాలపట్నంలోని తన ఇంటి నుంచి గరిడీతో పాదయాత్ర నిర్వహించారు. ఉదయం 6 గంటలకు కొడుకు మౌర్యసింహ, టీడీపీ నాయకులు, వార్డు కార్పొరేటర్లతో కలిసి కాలినడకన భారీ ర్యాలీగా వెళ్లారు. సింహాచలంలో అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. అప్పన్న స్వామి కృపతో గెలిచానని అందుకే మొక్కు తీర్చుకున్నానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రామోజీరావుకు నివాళి


రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: ఈనాడు అధినేత రామోజీరావు మృతికి ఎమ్మెల్యే గణబాబు సంతాపం తెలిపారు. గోపాలపట్నంలో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పత్రికారంగంలో ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు చెల్లించాలి


యుటిలిటీస్ విభాగం వద్ద ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యుటిలిటీస్ విభాగానికి చెందిన కాంట్రాక్ట్ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని ఉక్కు కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు, కార్మికులు విభాగాధిపతి కార్యాలయం వద్ద శనివారం ధర్నా చేశారు. విభాగంలో కాంట్రాక్ట్ పనులు చేస్తున్న ఉమా కన్‌స్ట్రక్షన్‌లో 33 మంది కార్మికులు పని చేస్తున్నారని, వారికి మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. వారికి పీఎఫ్, ఈఎస్ఐ కూడా కట్టకపోవడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం విభాగాధిపతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బి.రమణ, శంకరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాచపోలమాంబ సతకంపట్టులో పూజలు

అల్లిపురం : అల్లిపురం మెయిన్ రోడ్డులో గల శ్రీ రాచపోలమాంబ అమ్మవారి సతకం పట్టు ఆలయ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంపత్ వేంకటేశ్వరుడికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

కంచరపాలెం: గొల్లకంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మిదేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ, అర్చకుల నేతృత్వంలో వెంకన్నకు సుప్రభాత సేవ, చక్రస్నానం చేశారు. తెల్లవారుజాము 6 గంటలకు శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ దంపతులు పంచామృతాభిషేకాలు, తులసీమాలార్చన, కుంకుమ పూజలు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పేదలకు చీరల పంపిణీ


పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న దొడ్డి కిరణ్

గోపాలపట్నం: డీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ 89వ వార్డు ఇన్‌చార్జి దొడ్డి కిరణ్ పేదలకు చీరలు పంపిణీ చేశారు. తన తండ్రి 21వ వర్ధంతి సందర్భంగా నరవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద సుమారు 200 మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నరవ గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేత్ర పర్వం.. అప్పన్న నిత్య కల్యాణం


మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో స్వామివారి నిత్యకల్యాణాన్ని నేత్ర పర్వంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార: గుట్టుగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు జిల్లాకు చెందిన కిల్లో లచ్చన్న, కాకినాడకు చెందిన గరికిన మెహేష్ అనే ఇద్దరు యువకులు ఒడిశా నుంచి గంజాయి తీసుకువచ్చి ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డీఎల్‌బీ గ్రౌండ్ సమీపంలో సంచరిస్తున్నారు. అటువైపు వెళ్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు అనుమానాస్పదంగా తిరుగుతున్న వాద్దరినీ విచారించి, వారి బ్యాగ్‌లో తనిఖీ చేసి చూడగా రెండు కిలోలు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే యువకులను అదుపులోకి తీసుకొని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.

మండుటెండలో ట్రాఫిక్ పోలీసుల విధులు


శ్రీహరిపురం సెంటర్ వద్ద మండుటెండలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్


కోరమాండల్ జంక్షన్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మల్కాపురం: అసలే మండు వేసవి.. ఆపై అధిక ఉష్ణోగ్రతలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. భానుడి ప్రతాపానికి ఉదయం 7 గంటల నుంచే ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి. అటువంటి మండుటెండలో మల్కాపురం పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ పోలీసులు ఎంతో నిబద్ధతగా తమ విధులు నిర్వర్తిస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని మల్కాపురం, శ్రీహరిపురం, కోరమాండల్, సింధియా వంటి ప్రధాన కూడళ్లలో రోజూ ఐదుగురు ట్రాఫిక్ పోలీసులు విధులు ఉంటున్నారు. ఈ ప్రాంతాల్లో కనీసం నీడ కూడా ఉండదు. ఎండ వేడికి తట్టుకోలేక.. ఉక్కపోతకు ఉండలేక ఆ జంక్షన్‌లో ఉన్న ఏదైనా షాపు వద్దకు వెళ్లి కాసేపు సేద తీరుదామనుకుంటే కుదరని పరిస్థితి. ప్రధాన కూడళ్లలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బందికి నీడ, తాగునీటి సదుపాయాలు కల్పించాల్సి ఉంది. ఉన్నతాధికారులు దృష్టిసారించి అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ సిబ్బంది కోసం సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

సాగరతీర స్వచ్ఛతలో ఏయూ విద్యార్థులు


బీచ్ క్లీనింగ్ కార్యక్రమం ప్రారంభిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్


వ్యర్థాలను ఏరివేస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్ తదితరులు

ఏయూక్యాంపస్: ప్రపంచ సముద్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యార్థులు బీచ్‌క్లీన్ కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఉదయం 6 గంటలకు ఆర్‌కె బీచ్ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం 8 గంటలకు వైఎంసీఏ వద్ద ముగిసింది. కార్యక్రమంలో ఏయూ విద్యార్థులు, ఎన్‌సీసీఆర్, సీఎంఎఫ్ఆర్ఐ, సీఐఎఫ్‌టీ శాస్త్రవేత్తలు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ప్రారంభించారు. కార్యక్రమంలో సమన్వయకర్త ఆచార్య పి.జానకీ రామ్ తదితరులు ప్రసంగించారు. 250 మందికి పైగా వలంటీర్లు పాల్గొని బీచ్‌లో వ్యర్థాలను ఏరివేసి జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి అందజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అల్లిపురం: చావులమదుము జంక్షన్‌లో గల బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలోని ఓ పెద్ద కాలువలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం వెలుగుచూసింది. పోలీసులు అందించిన సమాచారం మేరకు సుమారు 45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి కాలువలో పడి వున్నట్లు స్థానికులు గుర్తించారు. అతని వివరాలు తెలియకపోవడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కాలువలో నుంచి మృతదేహాన్ని వెలుపలకు తీశారు. వివరాలు తెలిసిన వారు 9440904716, 0891 2783672, 7981674667లో సంప్రదించాలని కోరారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన


తులసీదళాల నడుమ అమ్మవారు

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో కొలువుదీరిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. అమ్మవారికి ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొన దలచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ కార్యనిర్వహణాధికారి పి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులరెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారులు కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ


శ్రీవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో పాటు, సెలవు రోజు కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీవారి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. వేకువజామున సుప్రభాత సేవ, తోమాల సేవ, అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ముందుగా శ్రీవారి పాదాల వద్ద మహిళలు పసుపు, కుంకుమ సమర్పించారు. అనంతరం మహాలక్ష్మి, గోదాదేవిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కోలాటాలు, శ్రీవారి నామసంకీర్తన భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

- శ్రీవారి ఆలయంలో రెండో శనివారం కావడంతో లడ్డూ విక్రయాలు జోరుగా సాగాయి. 750 గ్రాముల కళ్యాణ లడ్డూ రూ.200, 140 నుంచి 170 గ్రాముల బరువు గల సాధారణ లడ్డూ రూ.50లకు భక్తులకు విక్రయించారు. ఇక్కడ కూడా భక్తులు బారులు తీరారు.

బాలికలకు వరం బాలసదనం


వసతి గృహం లోపల విశాల ప్రాంగణం

భీమునిపట్నం: అనాథ, నిరుపేద బాలికలకు భీమిలిలోని బాల సదనం వసతి గృహం వరంలా మారి ఆదుకుంటోంది. మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వసతి గృహంలో ఒకటో నుంచి ఐదో తరగతి వరకు తల్లిదండ్రులను కోల్పోయిన వారు, తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు, నిరుపేదలు, దివ్యాంగుల పిల్లలకు కుల, మతాలతో సంబంధం లేకుండా ప్రవేశం కల్పిస్తారు. ఇందులో 30 ఖాళీలు ఉండగా ఈ నెల 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక్కడ చేరే వారిని సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి బాలసదనంలో వసతి, భోజన సదుపాయం కల్పిస్తారు. బాలసదనంలో చేరి చదువుకునే పిల్లలకు విశాలమైన ప్రాంగణంతోపాటు మంచి గదులు, అందులో మంచాలు ఉంటాయి. బాలికలకు దుస్తులు, పౌడర్ డబ్బాలు, సబ్బులు, ఇతర అవసరాలకు సంబంధించినవి అందిస్తారు. అలాగే విజ్ఞానానికి సంబంధించిన చక్కని పుస్తకాలతో చిన్న గ్రంథాలయం, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్ ఆడుకునే సదుపాయం ఉంది. ఇక్కడ యోగా కూడా నేర్పుతారు. బాలసదనంలో సూపరింటెండెంట్‌తోపాటు మ్యాట్రిన్, హెల్పర్, స్టోర్ కీపర్, హౌస్ కీపర్, ఎడ్యుకేటర్, యోగా టీచర్, ఇతర సిబ్బంది ఉన్నారు. వీరంతా పిల్లలను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తారు. ఇక్కడ చేరాలనుకునే వారు పూర్తి వివరాల కోసం బాలసదనం సూపరింటెండెంట్ కె.ప్రమీలను 7893514460లో సంప్రదించవచ్చు.

సముద్రాలను కాపాడుకోవాలి


మాట్లాడుతున్న కృష్ణకుమారి

బీచ్‌రోడ్డు: మన సముద్రం మన వాతావరణం కోసం కృషి చెయ్యాలని యాక్షన్ ఎయిడ్ సంస్థ ఫెలోషిప్ ప్రతినిధి ఐ.కృష్ణ కుమారి కోరారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సం సందర్భంగా శనివారం సాయంత్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడాది పొడవునా ప్రపంచ వ్యాప్తంగా మహా సముద్రాలను కాపాడుకోవాల్సిన రోజులే అని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. ఒక మహా సముద్రం, ఒకే వాతావరణం, ఒక్కటే మన భవిష్యత్తు అనే ఆలోచనతో సమష్టిగా కృషి చెయ్యాలన్నారు. సమస్త జనావళిని సముద్రాల పరిరక్షణకు చైతన్య వంతులు చేయాలన్నారు. 2030 నాటికి సముద్ర ఆధారిత పరిశ్రమల ద్వారా 40 మిలియన్ల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ


ఆలయ ప్రదక్షిణలో భక్తులు, అర్చకులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.